

సీజనల్ వ్యాధుల విజృంభణ..



● పెరుగుతున్న జ్వరం, జలుబు, దగ్గు బాధితులు ● ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగుల కిటకిట

● పరిసరాల పరిశుభ్రత పాటించాలంటున్న వైద్య నిపుణులు

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు ఆసుపత్రులకు వరుస కడుతున్నారు. ప్రధానంగా జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పితో పాటు డెంగీ, టైఫాయిడ్‌తో పలువురు ఆసుపత్రుల బాట పడుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల వ్యాధుల వ్యాప్తి పెరిగి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరిగింది. నిత్యం వందల సంఖ్యలో వైరల్ ఫీవర్ కేసులు, అక్కడక్కడ డెంగీ, మలేరియా కేసులు నమోదవుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు అంటున్నాయి. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలతో పాటు పలు గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాల కేసులు పెరుగుతున్నాయి. దీంతో వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ తదితర శాఖల అధికారులు దృష్టి సారించారు.

● పెరుగుతున్న ఇన్ పేషంట్లు

జిల్లా కేంద్రంలో ప్రధాన ఆసుపత్రితో పాటు మెడికల్ కళాశాలకు అనుబంధంగా మాతా శిశు కేంద్రం పనిచేస్తున్నాయి. వీటితో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గల 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 151 సబ్ సెంటర్లు, 24 గంటలు పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 71 పల్లె దవాఖానాలు, మూడు బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలు వైద్య సేవలు అందిస్తున్నారు. వీటితో పాటు 200 వరకు పలు ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. జిల్లాలో 2018 సంవత్సరంలో 31 డెంగీ కేసులు, 2019 సంవత్సరంలో 158 డెంగీ కేసులు, 2020 సంవత్సరంలో 5 డెంగీ కేసులు, 2021 సంవత్సరంలో 98 డెంగీ కేసులు, 2022 సంవత్సరంలో 309 డెంగీ కేసులు, 2023 సంవత్సరంలో 110 డెంగీ కేసుల, 2024 సంవత్సరంలో 29 డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుత సంవత్సరంలో ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల వైరల్ ఫీవర్, డెంగీ, మలేరియా కేసులను వైద్యులు గుర్తిస్తున్నారు. గత వారం రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఔట్ పేషంట్ల సంఖ్య, ఇన్‌పేషంట్ల సంఖ్య రెట్టింపు అయినట్లుగా తెలుస్తోంది.

● జ్వరం తగ్గకపోతే పరీక్షలు..

రోగాల బారిన పడి ఆసుపత్రులకు వస్తున్న వారిలో మూడు, నాలుగు రోజుల్లో జ్వరం తగ్గకపోతే డెంగీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. అంతేకాకుండా ఎక్కడైతే డెంగీ కేసు నమోదు అయిందని సమాచారం వస్తే వెంటనే అక్కడి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది వెళ్లి ఇంటి పరిసరాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నారు. మరోవైపు కాలనీలు, అపార్ట్‌మెంట్ వాసులు చెత్తను రహదారులపై పారబోయకుండా జాగ్రత్తలు వహిస్తున్నారు. గతంలో ప్రతీ శుక్రవారం ఒక్క రోజు మాత్రమే డ్రైడే పాటించగా, ప్రస్తుతం సీజన్ ముగిసే వరకు నిత్యం డ్రైడేగా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.



పురానిపేటలో మురికి కాలువను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

● పెరిగిన ఆర్ఎంపీల రెఫరెన్స్‌లు...

జిల్లాలోని పలు పల్లెల్లో ఆర్ఎంపీలదే హవా కొనసాగుతోంది. పల్లె ప్రాంతాల్లో జ్వర పీడితులు ఎక్కువగా ఉండడంతో ముందుగా స్థానికంగా ఉన్న ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలు రెండు, మూడు రోజుల పాటు చికిత్స అందిస్తుండగా జ్వరాలు తగ్గని పరిస్థితుల్లో పట్టణాలు, నగరాల్లో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. జిల్లాలోని పట్టణాల్లో గల ప్రైవేటు ఆసుపత్రుల్లో సైతం రోగుల తాకిడి పెరిగింది. దీన్ని ఆసరా చేసుకుంటున్న..

మిగతా 8లో

ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి

● బుదుమజ్జి సత్యప్రసాద్, కలెక్టర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టించడానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ బుదుమజ్జి సత్యప్రసాద్ తెలిపారు. జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శ వంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం పని చేస్తున్నట్లు ఆయన అన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కలెక్టర్ మరిన్ని విషయాలను పంచుకున్నారు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

కలెక్టర్ : ప్రభుత్వ లక్ష్యం మేరకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో జిల్లా అధికార యంత్రాంగంతో పాటు ప్రజా ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళ్తున్నాం. ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ప్రజావాణికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కలెక్టర్ : ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా జిల్లా స్థాయి అధికారులు హాజరుకావాల్సి ఉంటుంది. గత వారం ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకాని పది మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం.

ఆంధ్రజ్యోతి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కలెక్టర్ : జిల్లాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు ఆశించిన స్థాయిలో జరగకపోవడంలో పలు కారణాలున్నాయి. పనులు ప్రారంభించడానికి ముహూర్తాలు ఒక కారణమయితే, ప్రైవేటు మార్కెట్‌లో ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు ఎక్కువగా ఉండడం కారణంగా తెలుస్తోంది. అయినప్పటికీ లబ్ధిదారులను ప్రోత్సహించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఇటీవల జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో రాజకీయ జోక్యం కారణమన్న ఆరోపణల్లో వాస్తవం ఎంత?

కలెక్టర్ : జిల్లాలో తహసీల్దార్ల బదిలీ వ్యవహారంలో ఎలాంటి వివాదాస్పదం లేదు. పరిపాలన పరమైన కారణాల వల్ల తహసీల్దార్ల బదిలీ జరిపాం. రాజకీయ జోక్యం కారణమన్న బదిలీ జరిగిందన్న ఆరోపణలల్లో వాస్తవం లేదు.

ఆంధ్రజ్యోతి : గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

కలెక్టర్ : జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ఆహార పదార్థాల తయారీ, నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎలాంటి ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. లక్ష్మీపూర్‌లో జరిగిన సంఘటనపై పరిశీలన జరిపాం. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న విద్యార్థులతో మాట్లాడి కారణాలను తెలుసుకున్నాం. కొందరు విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు, మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులను అప్రమత్తం చేసి పాఠశాలల్లో వైద్య శిబిరం నిర్వహించాం.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ముందస్తు కసరత్తు చేస్తున్నారు?

కలెక్టర్ : ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకున్నా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగాన్ని సంసిద్ధులను చేశాం. ఓటరు జాబితా తయారీ, బ్యాలెట్ బాక్సుల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బంది తదితర అంశాలపై దృష్టి సారించాం. ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఎన్నికల నిర్వహణకు అవసరమైన కసరత్తులు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ ఉపాధ్యాయుల సర్దుబాటు జాబితాలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై మీ స్పందన?

కలెక్టర్ : ఎలాంటి అవకతవకలు జరగకుండా వర్క్ అడ్జెస్ట్‌మెంట్ జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించాం. ఉపాధ్యాయుల సర్దుబాటు జాబితాపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. అవసరమైన చోట్ల ఉపాధ్యాయులను నియమిస్తూ సర్దుబాటు జాబితా రూపొందించాం. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో బోధన సక్రమంగా జరిగేలా ఉపాధ్యాయుల సర్దుబాటును నిర్వహించాల్సి ఉంటుంది.

సహకార సంఘాల తనిఖీ

మల్లాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో యూరియా విక్రయాలను జిల్లా సహకార అధికారి సిహెచ్ మనోజ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలోని చిట్టాపూర్, సిర్పూర్, మల్లాపూర్, ముత్యంపేట గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో యూరియా విక్రయాల తీరును డీసీవో పరిశీలించారు. రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులకు పంట విస్తీర్ణం ఆధారంగా యూరియా విక్రయించాలని సూచిం చారు. జిల్లా సహకార అధికారి వెంట మెట్‌పల్లి క్లస్టర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ నిజాముద్దీన్, సహకార సంఘాల కార్యదర్శులు రవితేజ, రాజేశ్వర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోయినిపెల్లి ఆనందరావు, యాల్ల అమర్నాథ్‌రెడ్డి అన్నారు. జగిత్యాల అర్బన్ మండలంలోని కేజీబీవి, ధరూర్ క్యాంప్, వీక్లిబజార్, పురాణిపేట్, మోతె, గోపాల్‌రావుపేట్, కొత్తవాడ, ఖాజీపుర పాఠశాలల్లో పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అర్బన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు విద్యాదేవి, పద్మ, వివిధ హోదాల బాధ్యులు తదితరులున్నారు.

ప్రతీ ఒక్కరికి ఆధార్‌కార్డు తప్పనిసరి

● అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి ● కలెక్టర్ సత్యప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికి ఆధార్‌కార్డు తప్పనిసరని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆధార్ మానిటరింగ్ కమిటీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు జన్మించిన వెంటనే సంబంధిత ఆసుపత్రి వారిద్వారా జనన ధ్రువీకరణపత్రం తీసుకోవాలన్నారు. ఆసుపత్రుల్లో పిల్లలకు టీకాలు వేసే సందర్భంలో ఆధార్ ద్వారా ఎన్‌రోల్‌మెంట్‌ను ప్రోత్సహించాలన్నా రు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించి ఆధార్ లేనట్లయితే నమోదు చేసుకునే విధంగా అవగాహన కార్యక్ర మాలను నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఆర్‌డీవో రఘువరన్, డీడబ్ల్యూవో నరేశ్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

కోరుట్ల రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామంలో పీఎంజీఎస్‌వై పథకంద్వారా హైలెవల్ వంతెన, చిన్నమెట్‌పల్లి నుంచి మేడిపల్లి మండల కట్లకుంట గ్రామం వరకు నిర్మాణం చేస్తున్న తారు రోడ్డు పనులను పరిశీలించారు.

రోడ్డు పనులు నడుస్తున్నందున ప్రజలకు ఇబ్బందులు కలుగ కుండా చూడాలని అధికారులకు సూచించారు. అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో పనిచేసి రోడ్డు పనులను వేగవంతగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్య క్రమంలో ఆర్‌డీఓ జీవాకర్ రెడ్డి, ఈపీఆర్ఓ లక్ష్మణ్ రావు, తహసిల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీఓ రామకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

● అదనపు కలెక్టర్ బీఎస్ లత



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ లత

మల్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. మండలంలోని మల్యాల శివారులో గల కస్తూర్బా గాంధీ విద్యాలయం, తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలలో అడిషనల్ కలెక్టర్ శుక్రవారం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఆయా వసతి గృహాల్లోని వంట గదులను, స్టోర్ రూం, కూరగాయలు పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తు న్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లా డుతూ శుచి, శుభ్రతతో విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. వర్షాకాలం సీజన్ నేప థ్యంలో వంటశాల, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అడిషనల్ కలెక్టర్ వెంట తహసీల్దార్ వసంత, ఆర్ఐ తిరుపతి, గురుకుల ప్రిన్సిపాల్ మానస, కస్తూర్బా ప్రత్యేక అధికారి స్రవంతి తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్



పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కకు నీరు పోస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

మల్లాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్ర ణకు గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్‌ను నిర్వహించాలని ఎస్పీ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటు ఉంటూ మెరుగైన సేవలందిస్తూ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం మల్లాపూర్ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ సందర్శించారు. పోలీసుస్టేషన్ పరిసరాలు, వివిద కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి కేసులవివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణంలో మొక్కనాటి నీరు పట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రజాసమస్యలపై వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వరన్యాయం జరిగే విధంగా భరోసా కల్పించాలన్నారు. నేరాల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి చూపుతూ స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శించాలన్నారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పరచాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగు పరచుకుంటూ యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరాల నివారణపై చైతన్యాన్ని తీసుకోవాలని పలు సూచనలు చేశారు. పోలీసు స్టేషన్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమ శిక్షణతో ఉండాలని సూచించారు. అధునాతన టెక్నాలజీ ఉపయోగించడం గురించి ప్రతి ఒక్క ఉద్యోగి అవగాహన కలిగి ఉండలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాములు, సీఐ అనిల్ కుమార్, ఎస్సైలు రాజు, చిరంజీవి, రాజునాయక్, శ్రీధర్‌రెడ్డి, అనిల్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఎం అసమర్థతతోనే రైతులకు నీటి కష్టాలు

-కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనతో నీరులేక రైతులు అష్టకష్టాలు పడుతున్నారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. శుక్రవారం మెట్‌పల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో ఎంపికైన 76 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంట పొలాలకు నీళ్లందక ఎండిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్స్ అందజేత

కోరుట్ల రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 108 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు శుక్రవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పట్టణంలోని కావేరి గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొసీడింగ్ పత్రాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మాజీ ఎంపీపీ తోట నారాయణ, రైతు సమన్వయ కమిటి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

●మల్లాపూర్: ఇందిరమ్మ లబ్ధిదారులకు మండల కేంద్రంలోని కేఎంఆర్ గార్డెన్స్‌లో ఎమ్మెల్యే ప్రొసీడింగ్ పత్రాలను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్లు నర్సారెడ్డి, అంజిరెడ్డి, మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

'విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి'



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారానికి జూలై 23న తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల బాధ్యులు రజినీకాంత్, అక్రమాలిక్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యార్థుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తే అధికారాన్ని కోల్పోయిందని, గత ప్రభుత్వ తప్పిదాలు తాము చేయమంటూ నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండేళ్లు గడుస్తున్న తరుణంలో కూడా నేటికీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, ఖాళీలను భర్తీచేయడంతో పాటు, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు చాంద్, రాకేష్, ప్రేమ్‌కుమార్, రహీం, రామచంద్ర, సంజయ్, విఘ్నేష్, శ్రీకాంత్ తదితరులున్నారు.

ఎన్టీపీసీలో గంజాయి పట్టివేత

జ్యోతినగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో గురువారం రాత్రి గంజాయిని పట్టుకున్నారు. మేడిపల్లి సెంటరులో వాహనాలు తనిఖీచేస్తున్న క్రమంలో స్కూటీపై వెళ్తున్న ఇద్దరు యువకులను ఆపారు. వాహనంలో తనిఖీ చేయడంతో 100గ్రాముల గంజాయి దొరికింది. పట్టుబడిన ఇద్దరుయువకులు పారిపోయారు. వారిలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొల్లి అజయ్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఇతర నిందితుల కోసం గాలిస్తున్నామని ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. స్కూటీతోపాటు మరో వాహనాన్ని సీజ్‌చేసినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మున్సిపల్ నాలాలో పసికందు మృతదేహం

కోల్‌సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెడికల్‌కళాశాల సమీపంలోని రాజలక్ష్మికాలనీ వద్ద గల మున్సిపల్ నాలాలో శుక్రవారం పసికందు మృతదేహాన్ని గుర్తించారు. స్థానికులు మున్సిపల్ కార్పొరేషన్, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వెలికి తీశారు. కార్పొరేషన్ సిబ్బంది ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవం సమయంలో మృతి చెందిన పసికందును మృతదేహాన్ని డ్రైన్‌లో పడవేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈఘటన సప్తగిరి కాలనీ, ఐబీకాలనీ ప్రాంతాల్లో చర్చనీయాంశం అయ్యింది.

జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్లకు ఆర్థిక కష్టాలు



- మూడు నెలలుగా అందని వేతనాలు
- రాష్ట్రంలో 420 మంది ఇంటర్ ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్ల అవస్థలు

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు నెలలుగా కాంట్రాక్టు లెక్చరర్లకు వేతనాలు అందకపోవడం వల్ల కష్టాల పాలవుతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న సుమారు 420 మంది ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లు సకాలంలో వేతనాలు అందక విలవిలలాడుతున్నారు. చాలీచాలని జీతాలతో అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు బోధిస్తున్న కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు ఏప్రిల్, మే, జూన్ నెలలకు చెందిన జీతాలు రాకపోవడంతో భార్యాపిల్లలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక శాఖ క్లియరెన్స్ రాకపోవడం వల్ల వేతనాలు అందడం లేదని వాపోతున్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఇంటర్ బోర్డు పరిధిలో దాదాపు మూడు వేల మంది కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేశారు. ఇంటర్ ఒకేషనల్ కోర్సు విభాగంలో పనిచేస్తున్న సుమారు 420 మంది కాంట్రాక్టు లెక్చరర్లు పోస్టులు మంజూరు కాకపోవడం, పలు ఇతర కారణాల వల్ల రెగ్యులర్ కాలేదు. ఒకవైపు ఉద్యోగాలు రెగ్యులర్ కాకపోవడం, మరోవైపు ఏప్రిల్ నెల నుంచి వేతనాలు అందక పోవడం వల్ల అర్థాకలితో అలమటిస్తూ అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం దృష్టి సారించి కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు అందించాలి

నలువాల శ్రీనివాస్, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల



రాష్ట్రంలో జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల పెండింగ్ వేతనాలు వెంటనే అందించాలి. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. వేతనాలు ఏనెలకు ఆనెల సక్రమంగా అందించాలి. వేతనాలకు ఎప్పటికప్పుడు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది.

మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు

కాసం గంగా భవాని, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఆర్థిక శాఖ క్లియరెన్స్ లేకపోవడంతో వేతనాలు అందడం లేదంటున్నారు. చాలీ చాలనీ వేతనాలతో సంవత్సరాల తరబడి పనిచేస్తున్నాము. ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి.

కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలి

- ఈ నెల 21న టెక్స్‌టైల్ పార్కు బంద్
- కార్మికుల సమావేశంలో నిర్ణయం



నిరసన తెలుపుతున్న కార్మికులు

తంగళ్లపల్లి, జులై 18 (ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ పార్కు కార్మికులకు నష్టం చేసే విధానాలను ప్రభుత్వం మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్‌పార్కు కార్మికుల సమావేశం యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సిఐటియు జిల్లాకార్యదర్శి రమణ మాట్లడుతూ 2023 సంవత్సరం బతుకమ్మ చీరల జ్లౌజ్ పీస్ వస్త్రానికి కార్మికులకు రావాల్సిన 10శాతం యారన్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో కార్మికులకు అందించిన మాదిరిగానే మీటర్‌కు 1.42 పైసలు అందించాలన్నారు. నేతన్న పొదుపు పథకం పూర్తయిన డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయడంలో నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుపట్టారు. కార్మికుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించక పోవడంతో జులై21న ఒకరోజు బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమీక్ష జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సదానందం, వేణు, శ్రీకాంత్, అంజనేయులు, అంబదాస్, వెంకటేశ్, మహేశ్, ఆశోక్, రమేష్ శ్రీనివాస్, కనకయ్య, వరప్రసాద్, గంగారాం. లక్షణ్, రవి, శంకర్, ప్రభాకర్, నరహరి, సత్యనారాయణ, సంపత్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

23న విద్యాసంస్థల బంద్

- విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

గణేశ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. శుక్రవారం జిల్లాలోని తెలంగాణ చౌక్ వద్ద వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చ రమేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, పిడిఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కుతాటి రాణా ప్రతాప్, పిడిఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అంగడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

రాయికల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని ధర్మాజీపేట శివారులో శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన బెక్కం సాయిలు (70) తన పొలం నుంచి ఇంటికి వస్తుండగా శుక్రవారం రాత్రి ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

బాలికపై మేనమామ అత్యాచారయత్నం

- తప్పించుకున్న బాలిక
- నిందితుడిపై పోక్సో కేసు

తిమ్మాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై మేనమామ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన సంపంగి ప్రేమ్ కుమార్(30) అనేవ్యక్తి తనసొంత మేనకోడలు అయిన బాలికను ఆమె ఇంటి నుంచి కరీంనగర్‌లోని కళాశాల వద్ద తన ద్విచక్ర వాహనంపై దింపుతానని చెప్పి బలవంతంగా వెంట తీసుకువెళ్లాడు. కానీ కళాశాల వద్ద బాలికను దించకుండా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ శివారులో ఉన్న కాకతీయ కాలువ వైపునకు తీసుకెళ్లాడు. పక్కనే ఉన్న చెట్లపొదల్లోకి బాలికను బలవంతంగా తీసుకువెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక అతడికి సహకరించకపోవడంతో బండరాయితో హత్యాయత్నానికి ప్రయత్నించాడు. ప్రతిఘటించిన బాలిక తప్పించుకొని తన తల్లిదండ్రులకు విషయం తెలియజేసింది. తల్లిదండ్రులు బాలికను తీసుకొని తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పారు. బాలికను భరోసాకేంద్రానికి తీసుకువెళ్లి మహిళా అధికారి సమక్షంలో స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు సీఐ తెలిపారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు ప్రేమ్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు, పోలీసులు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, పట్టుకోవడానికి చర్యలు చేపట్టినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



దేవానందం(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో అనారోగ్యంతో ఈనెల 15న పురుగుల మందు తాగిన రైతు దేవానందం(62) మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయనకథనం మేరకు.. దేవానందం కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. వ్యవసాయపనులు చేసేందుకు ఆరోగ్యం సహకరించకపోవడంతో మనస్థాపం చెందిన దేవానందం పురుగుల మందు తాగాడు. మూడు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య రాజమణి, కొడుకు రాకేశ్‌లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ వివరించారు.

గుండెపోటుతో డీఎస్పీ మహేష్ మృతి

- కరీంనగర్ పోలీస్ శాఖలో విషాదం



హుజూరాబాద్‌లో భర్త మహేష్ మృతదేహంపై పడి రోదిస్తున్న ఏసీపీ మాధవి, ఇన్‌సెట్లో డీఎస్పీ మహేష్(ఫైల్)



డీఎస్పీ మహేష్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం/ హుజూరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌శిక్షణా కేంద్రంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న మహేష్(56) గుండెపోటుతో శుక్రవారం కన్నుమూశారు. ప్రస్తుత హుజూరాబాద్ ఏసీపీ మాధవి భర్త అయిన మహేష్ మృతిపట్ల పోలీస్‌శాఖతీవ్రదిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. హుజూరాబాద్‌లో తన భార్య ఏసీపీ మాధవి వద్ద ఉన్న మహేష్ ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే ఆయన్ను హుజూరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈఘటనతో ఏసీపీ మాధవితో పాటు కుటుంబసభ్యులు, పోలీస్ ఉన్నతాధికారులు తీవ్రవిషాదంలో మునిగిపోయారు. ఎస్‌ఐగా వృత్తిని ప్రారంభించిన మహేష్, సతీమణి మాధవితోకలిసి ఒకేసారి సీఐగా, ఆపై డీఎస్పీగా పదోన్నతులు పొందారు. ఫ్రెండ్లీ పోలీస్ అధికారిగా ఆయనప్రజలమన్ననలు పొందారు.

- **డీఎస్పీ మహేష్ పార్థివదేహానికి సీపీ నివాళి..**

కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌లో ఉన్న మహేష్ నివాసానికి చేరుకుని ఆయన పార్థివ దేహంపై పూలమాలవేసి సీపీ గౌస్‌ఆలం నివాళులర్పించారు. శోకసంద్రంలో ఉన్న ఏసీపీ మాధవికి, ఆమె కుమారులకు ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా మహేష్ ఆత్మకుశాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయనతోపాటు అడిషనల్ డీసీపీ(అడ్మిన్) వెంకటరమణ, కమిషనరేట్‌కు చెందిన పలువురు పోలీస్ ఉన్నతాధికారులు నివాళులర్పించారు.

పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం

కరీంనగర్ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో పట్టుబడిన, యజమానులు లేని (అన్‌క్లెయిమ్డ్), వదిలివేయబడిన (అబాండన్డ్) మొత్తం140 వివిధరకాల వాహనాలను బహిరంగ వేలంద్వారా విక్రయించనున్నట్లు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాలన్నీ ప్రస్తుతం కరీంనగర్ సీటీసీలో భద్రపరచినట్లు తెలిపారు. సిటీ పోలీస్ చట్టం-1348ఎఫ్, సెక్షన్40 ప్రకారం అందిన అధికారాలతో ఈ వాహనాలను వేలం వేయనున్నట్లు తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించిన పూర్తి వివరాలను వేలం బృందం సభ్యులు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్ సెల్ నంబర్ 8712670758లో సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు.

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అధికారిక ఫేస్‌బుక్ పేజీలో కూడా వివరాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వాహనాలపై ఏదేని అభ్యంతరం ఉన్నా, లేదా యాజమాన్య/హైపోథికేషన్ హక్కులు ఉన్నా, ఆసక్తిగల వ్యక్తులు ఆరు నెలలలోపు కరీంనగర్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిర్ణీత గడువులోగా ఎటువంటి క్లెయిమ్‌లు రాకపోతే, వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు.

డీఎస్పీ మహేష్ మరణవార్త దిగ్భ్రాంతికి గురిచేసింది

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్

భగత్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏసీపీ మాధవి భర్త డీఎస్పీ మహేష్ మరణవార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్‌శాఖకు మహేష్ చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. మహేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని వేడు కుంటున్నానని తెలిపారు. భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మాధవికి, ఆమె పిల్లలకు మనోధైర్యాన్ని కల్పించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

ప్రతీ రోజు వంద కిలోమీటర్లు

- బడి మీద మక్కువతో ప్రయాణిస్తున్న విద్యార్థిని



పానేటి పద్మ

మానకొండూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బడి మీద మక్కువతో రోజూ వంద కిలోమీటర్లు ప్రయాణిస్తోంది ఓ విద్యార్థిని. వివరాలు ఇలా ఉన్నాయి. మానకొండూర్‌లోని బాలుర ఉన్నతపాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పానేటి పద్మ గత సంవత్సరం వరకు మానకొండూర్‌లో ఉంటూ విద్య నభ్యసించింది. అయితే ఆమె తల్లి దండ్రులు వృత్తిరీత్యా సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటకు మకాం మార్చారు. మధ్యలో బడి మార్చలేని పరిస్థితి. అయితే ఇల్లంతకుంట నుంచి బస్సు సౌకర్యం లేదు. దీంతో తల్లి దండ్రులు ఆమెను వేములవాడలో ఉండే అమ్మమ్మ ఇంటిదగ్గర ఉంచారు. అక్కడి నుంచి ఆమె బస్సులో ప్రతిరోజు మానకొండూర్‌లోని బడికి వస్తోంది. ప్రతిరోజు రానుపోను వందకిలోమీటర్ల ప్రయాణం చేస్తూ పాఠశాలకు వస్తోందని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. అంతదూరం ప్రయాణం చేసినా ప్రతి రోజు అందరి కంటే ముందే పాఠశాలకు వస్తుందని ఆయన తెలిపారు.

ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఏడీ సమీక్ష

భగత్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బస్టాండ్ ఆవరణలోని సమావేశ మందిరంలో ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ శుక్రవారం కరీంనగర్ జోన్ పరిధిలోని ఐదు రీజియన్ల ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో అన్ని రీజియన్ల పనితీరు, వర్షాకాలం ప్రారంభం అయినందున తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రీజియన్ల నుంచి వివిధ పర్యాటక ప్రదేశాలకు నడుపుతున్న టూర్ ప్యాకేజీ సర్వీసులకు ప్రయాణీల నుంచి లభిస్తున్న ఆదరణ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రీజనల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజనల్ మేనేజర్లు, పి మల్లేశం, డి వియభాను, పి మహేశ్, వివిధ రీజియన్ల ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఏడీ సోలమన్

రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

కరీంనగర్ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటనలో ఒకరికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సెకండ్ అడిషనల్ జేఎంఎఫ్‌సీ కోర్టు తీర్పు వెలువరించింది. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ శివారులోని బైపాస్‌రోడ్‌లోని ఒక ఫంక్షన్‌హాల్ వద్ద 2016లో రోడ్డు దాటుతతున్న దెబ్బట కృష్ణమోహన్‌ను మినీవ్యాన్ ఢీకొట్టగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ కేసులో నిందితుడు మినీవ్యాన్ డ్రైవర్ సాధనవేని అలియాస్ తోట శంకరయ్యకు ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సెకండ్ అడిషనల్ జేఎంఎఫ్‌సీ కోర్టు తీర్పు వెలువరించిందన్నారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్ ఆర్ పరమేశ్వర్‌ను సీఐ అభినందించారు.

యువకుడి హత్య ఘటనలో ముగ్గురిపై కేసు



కిషన్‌రావుపేటలో రోదిస్తున్న కుటుంబీకులు, బంధువులు

వెల్గటూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటకు చెందిన సల్లూరి మల్లేష్ (26) అనేయువకుడి హత్యకేసులో శుక్రవారం ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. మృతుడి తండ్రి సల్లూరి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నైనాల రాజిరెడ్డి(రాజన్న), నైనాల మల్లారెడ్డి (మల్లేష్), కొత్తపేటకు చెందిన చింతల హరీష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. ఆయన కథనం ప్రకారం కిషన్‌రావుపేటకు చెందిన నైనాల రాజిరెడ్డి కూతురు విషయంలో గొడవ జరుగగా గతంలో సల్లూరి మల్లేష్‌పై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో మృతుడిపై ఆగ్రహంతో యువతితండ్రి నైనాల రాజిరెడ్డి, అతడి తమ్ముడు నైనాల మల్లారెడ్డి, కొత్తపేటకుచెందిన అతడి స్నేహితుడు చింతల హరీష్‌లు పథకం ప్రకారం గురువారం కోటిలింగాల రోడ్డు వైపు పాతవైన్స్ వెనక ప్రదేశంలో కత్తితో పొడిచి హత్య చేశారు.

- **భారీ బందోబస్తు మధ్య అంత్యక్రియలు**

మల్లేష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం శుక్రవారం కిషన్‌రావుపేటకు తీసుకువచ్చారు. ఈక్రమంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులను మోహరించారు. పోలీసులు మృతుడి కుటుంబీకులకు నచ్చజెప్పి న్యాయం జరిగేలా చూస్తామని ఒప్పించడంతో ఎలాంటి గొడవలు లేకుండా మల్లేష్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

- **మిన్నంటిన రోదనలు**

కిషన్‌రావుపేటకుచెందిన సల్లూరి రాజయ్యకు నలుగురు కుమార్తెలు కాగామల్లేష్ ఒక్కడే కొడుకు. తమకు ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, పాల్గొన్న విద్యార్థులు

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థులకు దాదాపు రూ.8,000కోట్లకుపైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మేము అధికారంలోకి వస్తేమార్పు తీసుకువస్తాం, విద్యార్థులకు పెండింగ్ బకాయిలను విడుదల చేస్తామని చెప్పి ఇంతవరకు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల చదువు పూర్తై సర్టిఫికెట్లు కావాలని అడిగితే పూర్తి ఫీజుకడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు అంటున్నాయని ఆరోపించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అయితే బకాయిలు రాకపోవడంతో విద్యార్థులతో పాటు కళాశాలల నిర్వాహకులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. అలాగే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో మౌళిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, పర్యవేక్షించడానికి 16 మండలాల్లో ఒక్క మండలానికి కూడా ఎంఈవో లేని దుస్థితి నెలకొందన్నారు. రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలని డిమాండ్‌చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో అసెంబ్లీనిముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఆసంపల్లి వినయ్‌సాగర్, ఎల్కటూరి ఇసాక్, సహాయకార్యదర్శులు దుర్గం భోగేశ్వర్, గట్టు ఆకాశ్, సందేశ్, రాకేశ్, అక్షయ్, సన్ని, నాయకులు లక్ష్మన్, చక్రి, మహేశ్, రఘు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ప్లాంట్‌లో యంత్ర సామగ్రి చోరీ

జ్యోతినగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ప్లాంట్‌లో ఎంజీఆర్‌లో ఉన్న విలువైన యంత్ర సామగ్రి చోరీకి గురైంది. చోరీ జరిగిందని ఎన్టీపీసీ ఏజీఎం విజయ్ కుమార్ సిక్దర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చురుగ్గా స్పందించారు. ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ నేతృత్వంలో పోలీసులు కొద్ది గంటల్లోనే శుక్రవారం సామగ్రిని పట్టుకున్నారు.

మేడిపల్లి సెంటరులోని ఒక దుకాణంలో దాచిన సుమారు 2.80 లక్షల రూపాయల విలువైన క్రషర్ హ్యామర్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నింది తులైన హర్యానాకు చెందిన వకీల్, మేడి పల్లి సెంటర్‌కు చెందిన అనిల్‌ను అదుపు లోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. అలాగే చోరీకి ఉపయోగించిన ట్రాక్టర్, ఎక్స్‌కావేటర్‌ను సీజ్‌చేశామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు చోరీ

తంగళ్లపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ప్రణయ్ తన ఇంటిముందు రాత్రి నిలిపిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని దుండగలు ఎత్తుకెళ్లారు. అలాగే పద్మనగర్‌కు చెందిన గాజుల మహేశ్ ద్విచక్రవాహనం రాత్రి ఇంటి ముందు పార్కుచేయగా ఉదయం చూసే సరికి వాహనం కనిపించకుండా పోయింది. ఈ సంఘటనలపై ఇద్దరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రణయ్ ఇంటి ముం దు ఉన్న సీసీకెమెరాను పరిశీలించగా ముఖానికి మాస్క్ ధరించిన ముగ్గురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై చేరుకుని ప్రణయ్‌ఇంటి ముందు వాహనం ఎత్తుకెళ్తున్న దృశ్యం రికార్డు అయ్యింది. పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఈ నెల 25న ఖని నుంచి బీదర్‌కు ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, రేజింతల్, జర సంఘంకు సూపర్ లగ్జరీ సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. 25న గోదావరిఖని బస్టాండ్ నుంచి తెల్లవారు జామున 3.30గంటలకు బయలు దేరి 10గంటలకు బీదర్‌కు చేరుకుంటుంది. అక్కడ స్వయంభుగా వెలసిన లక్ష్మీనర్సింహా స్వామిని ఆలయ దర్శనం అనంతరం 2 గంటలకు బీదర్ బుర్జా చేరుకుంటుంది.



అనంతరం రేజింతల్‌లో సిద్ధి వినాయక స్వామి దర్శనం అనంతరం సాయంత్రం 4 గంటలకు జరా సంఘంలోని శ్రీ కేతికి సంగమేశ్వర స్వామిని దర్శించుకుని రాత్రి 12 గంటలకు తిరిగి గోదావరిఖనికి చేరుకుంటుందన్నారు. గోదావరిఖని నుంచి పెద్దలకు రూ.1470, పెద్దపల్లి నుంచి రూ.1420, కరీంనగర్ నుంచి రూ.1370, పిల్లలకు గోదావరిఖని నుంచి రూ.1130, పెద్దపల్లి నుంచి రూ.1070, కరీంనగర్ నుంచి రూ.1030 చార్జీలను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గోదావరిఖని, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వివరాల కోసం 7013504982, 7989847927 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బీపాస్ స్థానంలో బిల్డ్ నౌ



- ఏఐ టెక్నాలజీతో భవన నిర్మాణాలకు అనుమతి
- ఇకపై అనుమతి తర్వాతే ఇంటి నిర్మాణం
- ఆగస్టు నుంచి అమల్లోకి

చొప్పదండి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీజీబీపాస్ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా బిల్డ్ నౌ ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. నాణ్యమైన, వేగవంతమైన పౌర సేవలను అందించడమే లక్ష్యంగా మున్సిపాలిటీలలో భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతి ప్రక్రియను ఇకపై బిల్డ్ నౌ ద్వారానే పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీపాస్, బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి బిల్డ్ నౌ ద్వారానే అనుమతులు పొందాల్సి ఉంటుంది.

బీపాస్‌ను ఈ నెలాఖరుకు ముగిస్తున్నట్లు తెలిసింది. బిల్డ్ నౌ పూర్తిగా ఏఐ టెక్నాలజీ ఆధారిత వ్యవస్థతో పోర్టల్‌ను రూపొందించగా నిర్మాణ అనుమతి ప్రక్రియ వేగంగా పూర్తవుతుంది. 75 గజాలలోపు నిర్మాణానికి అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసిన వెంటనే అనుమతి పొందవచ్చునని అధికారులు చెప్తున్నారు. ఆపై విస్తీర్ణం ఉన్న స్థలాలకు, లే అవుట్లకు 15 నుంచి 21 రోజులలోపు అనుమతి లభించనుంది.

ఏఐ టెక్నాలజీతో అనుమతి

నూతనంగా ప్రవేశట్టిన బిల్డ్ నౌ పోర్టల్ ఏఐ టెక్నాలజీతో పనిచేస్తుంది. అనుమతి కోసం దరఖాస్తు చేసిన వెంటనే సంబంధిత అధికారికి స్థలం లోకేషన్ తెలిసిపోతుంది. స్థలంలో ఎలాంటి నిర్మాణాలు ఉన్నాయో సులువుగా తెలుస్తుంది. నిమిషాల్లోపలే స్థలం పరిశీలన పూర్తవుతుంది.

గతంలో డిజైన్లు, పత్రాలు, మ్యాప్‌ల పరిశీలనకు 20 నుంచి 30 రోజుల సమయం పట్టేది. ఇప్పుడు సూచించిన విధానంలో పత్రాలను సమర్పిస్తే

బిల్డ్ నౌ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న నిర్మాణదారులు అనుమతి తీసుకున్న తర్వాతే భవన నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. బీపాస్ విధానంలో ఇంటి నిర్మాణం చేపట్టిన తర్వాత కూడా అనుమతి లభించేది. ప్రస్తుతం బిల్డ్ నౌలో మాత్రం అనుమతి తీసుకున్న తర్వాత ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. దరఖాస్తుదారుడి ఇంటి స్థలంలో ఎలాంటి కట్టడాలు ఉన్నా సంబంధిత అధికారికి ఏఐ టెక్నాలజీ ద్వారా స్థల స్వభావం తెలిసిపోతుంది.

అనుమతి తీసుకున్న తర్వాతే పనులు

దీంతో అధికారి భవన నిర్మాణ అనుమతి నిరాకరించే అవకాశం ఉంటుంది. 2020లో తీసుకువచ్చిన టీఎస్ బీపాస్ ఈ నెల 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనుంది. టీఎస్ బీపాస్ స్థానంలో ఆగస్టు 1 నుంచి పూర్తిస్థాయిలో బిల్డ్ నౌను వినియోగంలోకి తీసుకురానున్నారు. వేగవంతమైన పౌర సేవలందించడమే లక్ష్యంగా చేపడుతున్న సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం ఒకే రాష్ట్రం ఒకే విధానం పేరిట బిల్డ్ నౌకు శ్రీకారం చుట్టింది.



నిమిషాల్లోనే పరిశీలన పూర్తవు తుంది. అనుమతులు లేకుండా డిజైన్‌కు భిన్నంగా భవన నిర్మాణాలు చేపట్టడం, వ్యాపార అవసరాల కోసం నిర్మించే భవనాలను నివాస గృహాలుగా చూపడం వంటి వాటికి బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. లే అవుట్ నిర్మాణ స్థలం హద్దుల అతిక్రమణకు అవకాశం ఉండదు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం మే/జూన్-2025లో నిర్వహించిన డిగ్రీ-2,4,6వ(సీబీసీఎస్)సెమిస్టర్స్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ (బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీఏఎల్) సంబంధించిన పరీక్ష ఫలితాలను ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ శుక్రవారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు తమ ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in మరియు https://stvuresults. a{ure-websites.netలో చూసుకోవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్ కుమార్, అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ అబ్రరుల్ బాకి, అసిస్టెంట్ రిజిస్టర్ వై. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ కళాశాలను సందర్శించిన శాతవాహన వైస్ చాన్స్‌లర్

రామగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శాతవాహన వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్ శుక్రవారం మంథని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించారు. శాతవాహన యూనివర్శిటీకి అనుబంధంగా హుస్నాబాద్‌లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ కళాశాల ఆరంభం అవుతున్న నేపథ్యంలో మంథని ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న వసతులను పరిశీలించారు. కళాశాలలోని అకాడమీ బ్లాక్‌తో పాటు ల్యాబ్‌లు, లైబ్రరీ, తరగతి గదులను, హాస్టల్‌ను పరిశీలించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌తో సమావేశమై సిలబస్, అడ్మిషన్ల ప్రక్రియపై చర్చించారు. రిజిస్ట్రార్ రవికుమార్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ సురేష్, ప్రొఫెసర్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి ఉన్నారు.

క్రీడల జిల్లాగా ఖ్యాతి సాధించాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్



హరీష్‌ను సన్మానిస్తున్న డీవైఎస్‌వో, క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా క్రీడల జిల్లాగా ఖ్యాతిని సాధించాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ అన్నారు. జిల్లాలోని కోనరావుపేట మండలం నాగారానకు చెందిన బుర్రవేణి హరీష్ నేషనల్ ఇన్‌స్టూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ఐఎస్)లో ఆర్చరీ విభాగంలో సీటు సాధించగా శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో హరీష్‌ను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాలీబాల అకాడమీ కోచ్ గుర్రం సంపత్‌గౌడ్, ఎం జగన్మోహన్, కబడ్డీ కోచ్ ప్రశాంత్, వాలీబాల్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

డీపీవో కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

భగత్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో నమోదు లేని కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేయాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు శుక్రవారం కరీంనగర్‌లో డీపీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎలుకపెల్లి సారయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వడ్లూరి లక్ష్మీనారాయణ, కార్మికులు పర్లపల్లి రమేష్, కండె మధునయ్య, లక్ష్మీ, సరోజన, అవినాష్, నితిన్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా జూడో సెంటర్ పరిశీలన



క్రీడా పాఠశాల ఖేలో ఇండియా జూడో సెంటర్ విద్యార్థులతో సాయ్ డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలోని ఖేలో ఇండియా జూడో సెంటర్‌ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్)డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ జిమ్నాస్టిక్ కోచ్ చంద్రశేఖర్‌రావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియాలోని వివిధ విభాగాలను పరిశీలించారు. విద్యార్థుల గురించి, వారి ఖర్చుల గూర్చి, కోచ్ జీతభత్యాల గురించి అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేసిన వారు ఖేలో ఇండియా జూడో సెంటర్ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వి శ్రీనివాస్‌గౌడ్, ఖేలో ఇండియా కోచ్ కే శ్యామ్, ప్రాంతీయ క్రీడాపాఠశాల కోచ్‌లు ఇందిర, విక్రమ్, సాయి, కిష్టయ్య, పవన్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలి

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీ వినోద్ కుమార్, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను వెంటనే ఆన్‌చేసి నీటిని ఎత్తిపోయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంచిపేరు వస్తుందన్న అక్కసుతో కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయకుండా లక్షలాది మంది రైతుల ఉసురు పోసుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. దీనిపై సర్కారు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువమానేరు జలాశయాలు, చెరువులు వెలవెలబోతున్నాయన్నారు. ఈ ప్రాజెక్టుల నుంచి త్వరలోనే మంచి నీరు సరఫరా చేయలేని దుస్థితి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. కానీ మేడిగడ్డ బరాజ్ వద్ద 82 వేల పైచిలుకు క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహించి సముద్రం పాలవుతుందన్నారు. మేడిగడ్డ బరాజ్‌తో ఎటువంటి సంబంధం లేకుండా కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయడానికి అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మేడిగడ్డ బరాజ్‌తో సంబంధం లేకుండానే కన్నెపల్లి పంపుహౌస్ నుంచి రోజుకు 20 వేలపై చిలుకు క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసు కునే అవకాశం ఉందన్నారు.

కన్నెపల్లి పంపుహౌస్ నుంచి అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకు ఎత్తిపోయడానికి నేషనల్ డ్యాం సెప్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఎక్కడ అభ్యంతరం తెలుపలేదని గుర్తుచేశారు. ఎస్సారెస్పీ పునర్జీవం ద్వారా వరదకాలువను నిండుగా నింపుకోవడంతో పాటుగా ఈ పరిధిలోని అన్ని చెరువులను నింపడానికి పుష్కలమైన అవకాశాలున్నాయని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని పదే పదే చెపుతున్న రేవంత్ సర్కారు మాత్రం కక్ష పూరితంగానే వ్యవహరిస్తోందన్నారు. కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోస్తే కేసీఆర్‌కు మంచి పేరు వస్తుం దన్న అక్కసుతోనే కాంగెస్ ప్రభుత్వం నీటిని ఎత్తిపోయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిని ఎత్తిపోసే విషయంలో కాంగ్రెస్ సర్కారు ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చూపుతున్న వివక్ష, నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది రైతుల జీవితాలు ఆగమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు.

ప్రస్తుతం నార్లు ముదిరి పోతున్నాయని, ఈ సమయంలో నాట్లు వేసుకోవడానికి ఒక్కసారి సాగునీరు అందిస్తే రైతులకు అండగా నిలిచినట్లు అవుతుందన్నారు. మేడిగడ్డ బరాజ్‌ను యాజమాన్యమే రిపేర్ చేసుకోవాలని ఎన్‌డీఎస్ఏ ఇప్పటికే స్పష్టంగా చెప్పిందన్నారు. ఇప్పటికైనా కక్షలు మానుకొని రైతు సంక్షేమం కోసం కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి నార్లు వేసుకోవడానికి ప్రభుత్వం సహకరించాలని విజప్తిచేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, సిరిసిల్ల జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ సిద్ధం వేణు, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్లు ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్, ప్రాథమిక సహకార సంఘం ఛైర్మన్ రమణారావు, రాజేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి సారె..



పట్టువస్త్రాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

వేములవాడ కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరి అమ్మవారికి శ్రీవల్లి సేవా సంస్థకు చెందిన సుమారు 200 మంది సభ్యులు శుక్రవారం కన్నుల పండువగా సారె సమర్పించారు. తిప్పాపూర్ బస్టాండు నుంచి అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపు, కుకుమ, పూలు, పండ్లు, స్వీట్లతో ఊరేగింపుగా రాజన్న ఆలయానికి తరలి వచ్చారు. ముందుగా శ్రీలక్ష్మీ గణపతికి రాజరాజేశ్వర స్వామి వారికి పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలను అందజేశారు. అనంతరం రాజరాజేశ్వరి అమ్మ వారికి పట్టు వస్త్రాలు, పసుపు, కుంకు మ, పూలు, పండ్లు, స్వీట్లను అంద జేశారు. పాడి పంటలు, పిల్లపాపలు చల్లంగా ఉండేలా దీవించాలని అమ్మ వారిని వేడుకున్నట్లు సంస్థ ఫౌండర్ మల్లెబోయిన పుష్పలత తెలిపారు.



అమ్మవారికి సమర్పించిన పట్టువస్త్రాలు, పూలు, పండ్లు

స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కిని నరసింహులు



సమావేశంలో మాట్లాడుతున్న బక్కిని నరసింహులు

కరీంనగర్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కిని నరసింహులు, జాతీయ అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యుడు, కరీంనగర్ పార్లమెంట్ పరిశీలకులు నన్నూరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కమిటీలు పూర్తిచేసి గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావాలని అన్నారు. గ్రామాల్లో టీడీపీకి మంచి ఆదరణ ఉందన్నారు. పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థులు వ్యక్తిగత ఓటు బ్యాంకు కలిగి ఉంటే ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యకర్తలు సమన్వయంతో కలిసి పనిచేయాలని, పార్టీ శ్రేణులు ఎన్నికల్లో కసితో పనిచేసి టీడీపీ సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గొల్లపల్లి ఆనంద్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్ గౌడ్, పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ సభ్యులు కళ్యాడపు ఆగయ్య, దామెర సత్యం, ఆవునూరు దయాకర్‌రావు, బత్తుల శ్రీనివాస్, మచ్చ ఆంజనేయులు, నాగుల బాలాగౌడ్, తీగుట్ల రమేష్ కుమార్, రొడ్డ శ్రీనివాస్, రొడ్డ శ్రీధర్, లంక భాస్కరశర్మ, తాటికొండ శంకర్, ఆకుల కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య భవనాల కూల్చివేతలు





వేములవాడలో భవనాల కూల్చివేత వద్ద మోహరించిన పోలీసులు

వేములవాడ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండు నుంచి రాజన్న ఆలయం వరకు చేపడు తున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా భవనాల కూల్చివేతలు కొన సాగుతున్నాయి. మొత్తం 243 భవనాలు తొలగించేందుకు నిర్వాసితులను గుర్తించారు. అయితే 88 మంది హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకువచ్చారు. మిగతా ఇళ్లను గతనెల 16వ తేదీన పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. 88 మందికి కోర్టు స్టే ముగియడంతో శుక్రవారం ఆయా భవనాల కూల్చివేత ప్రారంభించారు. మరో 6 మంది నిర్వాసితుల స్టే గడువు సైతం ఈనెల 23వ వరకు ఉందని స్థానిక నిర్వాసితులు తెలిపారు. రాజన్న ఆలయం ముందు శుక్రవారం భారీగా పోలీసులు, అధికారులు చేరుకున్నారు.

కూల్చివేతలను పరిశీలించిన కలెక్టర్..

వేములవాడ పట్టణంలోని చేపడుతున్న కూల్చివేతలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం పరిశీలించారు. రాజన్న ఆలయం ముందు భాగంలో పనులు కొనసాగుతుండగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వెంట ఆర్డీవో రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ ఉన్నారు.

దివ్యాంగులకు రాయితీ రుణాలు



దరఖాస్తుకు ఈనెల 31 వరకు గడువు

కరీంనగర్ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నిర్ణయించింది. ఇతరుల మాదిరిగానే దివ్యాంగులు సాధారణ జీవనం గడపడమే ప్రధాన లక్ష్యంగా వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలు, వ్యాపారం వంటివి చేసుకునేలా దివ్యాంగుల ఉపాధి, ఉనరావాస పథకం అమల్లోకి తీసుకువచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే దరఖాస్తుల స్వీరణ ఆన్‌లైన్ విధానంలో ప్రారంభించారు. లబ్ధిదారులు ఈ నెల 31 తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నది. tgomms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. కరీంనగర్ రూరల్ మండలంలో ఇప్పటికే ఇరుకుల్ల గ్రామానికి చెందిన దివ్యాంగునికి 50వేల రుణం బ్యాంక్ లింకేజీ ద్వారా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ధ్రువపతారలతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు గ్రామీణ ప్రాంతం వారికి ఎంపీడీవో, పట్టణవాసులకు మున్సిపల్ కమిషనర్ లాగిన్‌లోకి వెళ్తాయి. వాటిని మండల స్థాయిలో ఎంపీడీవో, సీడీపీఓ, ఏపీఎంతో ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక చేస్తారు. ఇందులో మహిళలకు 33 శాతం అవకాశం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

అర్హులు ఎవరంటే..

కనీస దివ్యాంగత్వం 40శాతం పైన ఉండాలి. సదరం సర్టిఫికెట్ కలిగి ఉండాలి. వయస్సు 21-55 సంవత్సరాలలోపు ఉండాలి. ఆదాయ పరిమితి 1లక్ష 50వేలు (గ్రామీణ ప్రాంతాల వారికి) ఉండాలి. అయిదేళ్లలో దివ్యాంగుల సంక్షేమ శాఖ, ఇతర శాఖ, ఏదైనా ప్రభుత్వ సంస్థ నుంచి రాయితీ పొంది ఉండకూడదు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నం ప్రకాష్

గణేశ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బీసీలను, హిందూవులను అనాధి కాలం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తూనే ఉందని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ అన్నారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతున్నామని చెప్తూనే బీసీ-ఈ కేటగిరిలో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ ఇవ్వడం సరికాదన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు పక్కకు పెట్టి జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకలు పెంట శ్రీనివాస్, శానకొండ వాసు, మంతెన కిరణ్, మాదాసు సంజీవ్, నారోజు రాకేష్ చారి, మంద వెంకన్న, గుడిసెల రమేష్ గౌడ్, అజయ్, గుంపట మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

కోరుట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యంతో భరించలేక మనస్థాపం చెంది ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి కోరుట్ల పట్టణంలో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని భీముని దుబ్బ ప్రాంతానికి చెందిన వడ్లకొండ మురళి-రుషిత దంపతులు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు వశిష్ట(16) పుట్టుకతో వైకల్యం ఉంది. తండ్రి మురళి కుమారుడు వశిష్టను కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం వశిష్ట కండ్లు నొప్పి వచ్చి సరిగా కనిపించడం లేదని తండ్రి మురళికి ఫోన్ ద్వారా తెలుపడంతో పరీక్షలను చేయించాడు. వైకల్యం, కండ్లు సమస్యతో మనస్థాపం చెందిన వశిష్ట శుక్రవారం ఇంట్లో ఉరివేసుకోని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తండ్రి మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత

జగిత్యాలరూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ శీలం సురేందర్, చల్‌గల్‌లో జగిత్యాల కాంగ్రెస్ రూరల్ మండలశాఖ అధ్యక్షుడు జున్ను రాజేందర్ చేతుల మీదుగా శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు.

●**రాయికల్:** మండలంలో 776 మందికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. మైతాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి పత్రాలను అందజేశారు.

●**బీర్‌పూర్:** మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో భీమేష్, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, వైస్ ఎంపీపీ లక్ష్మన్ రావ్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వన మహోత్సవం

బీర్‌పూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీర్‌పూర్ మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో వన మహక్షత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాష్ట్ర స్థాయి హరిత మిత్ర అవార్డు గ్రహిత జూపాక సుదర్శన్ ఆద్వర్యంలో పాఠవాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రమాదువి, నాగరాణి, స్వరూప, లలిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ

వెల్గటూర్, జులై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటిలింగాల గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి తహశీల్దార్ శేఖర్, ఎంపీడీవో శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు నూతన జీపీ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాంరెడ్డి, పీఆర్ ఏఈ రాజు, కార్యదర్శి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

'రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, జూలై 18(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్మించుతున్న ఇందిరమ్మ ఇళ్ళను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుం దన్నారు. ఇందిరమ్మ ఇల్లును నిర్మించుకోవటానికి ఆర్థిక స్థోమత లేని వారికి శ్రీనిధి పథకం కింద లక్ష రూపాయల లోన్ ఇప్పించి స్వంత ఇల్లు నిర్మించుకునేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో 2లక్షల రూపాయలలోపు రుణ మాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, 9 రోజుల్లో 9వేల కోట్ల రైతులకు పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా కింద అందించామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక రేషన్ కార్డు, అర్హులైన నిరుపేదలకు ఒక ఇల్లు మంజూరు చేయలేదన్నారు. రేషన్ కార్డు మంజూరు నిరంతర ప్రక్రియ అన్నారు. అర్హులైన వారు ఎప్పుడైన దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. నియోజక వర్గంలో 3500ఇళ్లు మంజూరు కాగా అందరికీ ప్రొసీడింగ్ ఆర్డర్స్ అందించామన్నారు. స్దానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అధిక స్థానాల్లో విజయం సాధిస్తారన్నారు. గత సీఎం కేసీఆర్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేయగా, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఆర్థిక పురోగభివృద్ధి సాధించే దిశగా పాలన సాగిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజు రోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి పక్షాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈవిలేకరుల సమావేశంలో కొడిమ్యాల సింగిల్‌విండో చైర్మన్ రాజనర్సింగరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లి ఖార్జున్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్‌గౌడ్, నాయకులు స్వామి, రవి, శ్రీనివాస్, రాజేష్, రాజు, నర్సయ్య, ప్రసాద్, ప్రవీణ్, వినోద్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్, సాయి, శ్రీకాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

'పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం'



మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి నిరుపేద సొంత ఇంటి కల సాకారం చేస్తామని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ది దారులకు స్థానిక దేవిశ్రీ గార్డెన్ లో నిర్వహించిన సమావేశానికి మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి తాటి పర్తి జీవన్ రెడ్డి ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు పాల్గొన్నారు.

●రాయికల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నుంచి రాష్ట్ర ప్రజల అభిప్రాయాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అమలు చేసిందని మాజీ మంత్రి అన్నారు. రాయికల్ పట్టణంలోని వర్తక సంఘంలో శుక్రవారం 110 మందికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను మున్సిపల్ అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, మహిళా అధ్యక్షురాలు తాటిపాముల మమత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మ్యాకల అనురాధ, యూత్ పట్టణ అధ్యక్షుడు బత్తిని నాగరాజు పాల్గొన్నారు.

●మండలంలోని బోర్నపెల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాగుల సత్యం తల్లి మరణించగా వారి కుటుంబాన్ని శుక్రవారం మాజీ మంత్రి జీవన్ రెడ్డి పరామర్శించారు.

కాంగ్రెస్ హయాంలో సాగునీటికి ఇక్కట్లు



అక్కపెల్లి చెరువును పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హయాంలో సాగునీటికి రైతులు ఇక్కట్లు పడుతున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. బీడు భూములను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా కేసీఆర్ సర్కార్ ముందుకు వెళ్లిందని ఆయన అన్నారు. ధర్మపురి మండలంలోని బురుదేశిపల్లె సమీపంలో గల అక్కపెల్లి చెరువును శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడే ఉన్న రైతులతో మాట్లాడి చెరువు పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్కపెల్లి చెరువు రిజర్వాయర్ కోసం కేసీఆర్ సహకారంతో రూ.72.10 కోట్లు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. గోదావరి నదీ తీరాన ఒక బావి తవ్వించి దాదాపు ఏడాదిన్నర కాలం నుండి పనులు ఎందుకు నిలిపి వేయించారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఇన్‌చార్జ్‌గా నియమితులైన కొప్పుల ఈశ్వర్‌ను బీఆర్ఎస్ నాయకులు శాలువా కప్పి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ మాజీ చైర్మన్ సంగి సత్యమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, మాజీ ఎంపీపీలు ఎడ్ల చిట్టిబాబు, సౌళ్ల భీమయ్య, మాజీ వైస్‌ఎంపీపీ గడ్డం మహిపాల్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు మొగిలి శేఖర్, పట్టణ అధ్యక్షులు రాజేష్ పాల్గొన్నారు

ఎస్సారెస్పీకి నీటిని విడుదల చేయాలి

మెట్‌పల్లిటౌన్, జూలై18(ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీకి నీటిని విడుదల చేయాలని కోరుతూ జగ్గసాగర్, మేడిపల్లితో తో పాటు తదితర గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఎస్సారెస్పీకి నీటిని విడుదల చేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండ చర్యలు తీసుకోవాలని కోరగా అధికారులు సానకులంగా స్పందించినట్లు తెలిపారు.

కల్వర్టు నిర్మాణం చేపట్టాలి

మెట్‌పల్లిటౌన్, జూలై18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 11వ వార్డులోని పూసల కలుస్తుల శ్మానన వాటికకు వెళ్లె దారిలో కల్వర్ట్ నిర్మాణం ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం రాజరాజేశ్వర పూసల సంఘం కులస్తులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావుకు వినతి పత్రం అందజేశారు. నిధుల మంజూరుకు కృషి చేస్తానని జువ్వాడి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆకుల లింగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొమిరెడ్డి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

మల్యాల, జూలై 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలతోకి తీసుకెళ్లి రాబోయో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్ తదితరులు అన్నారు. స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశంను శుక్రవారం మద్దుట్లలో నిర్వహించారు. సమావేశంలో శనిగారపు తిరుపతి, నరేశ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల విజృంభణ

(ఐదో పేజీ తరువాయి)

ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు రూ.వేలల్లో ఫీజులు గుంజుతున్నాయి. ఇందులో కొంత మొత్తాన్ని రెఫర్ చేసిన ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రైవేటు ఆసుపత్రులు కమీషన్ల రూపంలో చెల్లిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

●ఇవి పాటిస్తే మేలు..

దోమకాటుతో డెంగీ, మలేరియా, చికున్ గున్యా, బోదకాలు, మెదడువాపు తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. వీటి నివారణకు గ్రామాల్లోని నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయడం, లేదంటే దోమలను తినే గంబూసియా అప్పినిస్ చేపలను వాటిలో వేసి గుంతలు పూడ్చడం వంటివి చేయాలి. మురుగు కాలువలు శుభ్రంగా ఉంచడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ లాంటివి చేయాల్సి ఉండగా సంబందిత శాఖల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడడం, వారానికోసారి డ్రమ్ముల్లోని నీటిని పారబోయటం, నీటి ట్యాంకులు, డ్రమ్ములు, మంచి నీటి ట్యాంకులపై మూతలు పెట్టడం, కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా చూడాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం
-డాక్టర్ నీలారపు శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, జగిత్యాల



జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు ఎప్పటికప్పుడు తీసుకుంటున్నాం. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక జాగ్రత్తలు వహిస్తున్నాం. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుతుం డడంతో పాటు మురుగు నీరు నిలువ ఉన్న ప్రాంతాలను గుర్తించి అప్రమత్తం చేస్తున్నాం. ఇళ్లలో ట్యాంకులు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు తదితర వాటిల్లో నీరు నిల్వ ఉండి లార్వా పెరిగే అవకాశముందని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

కథలాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని తాండ్ర్యాలలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ళ ప్రగతితో పాటు పల్లె దవాఖాన పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. పనులు అర్థాంతరంగా నిలిచిపోకుండా అధికార యంత్రాంగం ఎప్పడికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇల్లుకు అవసరమయ్యే మెటీరియల్ సకాలంలో అందుబాటులో ఉంచుకునేలా చూడాలన్నారు. పల్లె దవాఖాన పనులు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చూడాలని సంబంధిత ఇంజినీర్లకు చెప్పారు. తాండ్ర్యాలలో 22 ఇండ్లు మంజూరు కాగా 16 ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నట్టు కలెక్టర్‌కు ఎంపీడీఓ శంకర్‌నాయక్ వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వినోద్, కారోబార్ పానుగంటి సాగర్ ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

మల్లాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యను నేర్పాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఉపాధ్యాయులకు సూచించారు. బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ సురేష్‌రెడ్డి నిధులు రూ.4 లక్షలతో మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీ, మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మంచి నీటి వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

ఇబ్రహీంపట్నం, జూలై18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ సూచించారు. మండలంలోని కోమటి కొండాపూర్ గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనంను పరిశీలించారు.అలాగే మండలం లోని అమ్మక్కపేట గ్రామంలో లోని పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ పరిశీలించారు.

●**పెగడపల్లి:** విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన బోజనాన్ని వండి వడ్డించాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ బి.రవీందర్‌లు పేర్కొన్నారు.

మండలంలోని దీకొండ పాఠశాలలను ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, వెంగళాయిపేట పాఠశాలను తహసీల్దార్ రవీందర్‌లు వేర్వేరుగా పాఠశాలల్లో మధ్యాహ్న బోజన పథకాన్ని తనిఖీ చేశారు.

●**కొడిమ్యాల:** మండలంలోని కొండాపూర్ ఎంపీపీఎస్‌లో శుక్రవారం రెవెన్యూ పరిశీలకుడు ఆర్ఐ కరుణాకర్ మధ్యాహ్న బోజనాన్ని తనిఖీ చేశారు. బోజనం రుచికరంగా తయారు చేస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు సతీష్ ఉన్నారు.

జిల్లా స్థాయి అధికారిపై మహిళా ఉద్యోగుల ఫిర్యాదు

-విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని మహిళా కమిషన్ ఉత్తర్వులు

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయ ఓ మహిళా అధికారిణితో అదే కార్యాలయానికి చెందిన ఓ జిల్లా స్థాయి అధికారి అనైతిక సంబంధం కొనసాగిస్తున్నారని, దీనివల్ల మహిళా సిబ్బంది, ఉద్యోగులు మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్‌కు మహిళా ఉద్యోగులు ఫిర్యాదు చేసిన వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. సంబంధిత కార్యాలయానికి పలువురు మహిళా ఉద్యోగులు సికింద్రాబాద్‌లోని రాణిగంజ్‌లో గల రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ కలెక్టర్‌కు మహిళా కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో మెరుగైన విద్యుత్

కథలాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు, గృహ, వాణిజ్య వినియోగదారుల డిమాండ్ మేరకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తూ గ్రామాల్లో మెరుగైన విద్యుత్ ను సరఫరా చేస్తున్నామని ఎన్‌పీడీసీఎల్ మెట్‌పల్లి డివిజన్ డీఈఈ మదన్‌మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వాడల్లో నూతనంగా 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా ప్రక్రియను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఎక్కడా లోవోల్టేజీ సమస్య లేకుండా వినియోగదారులు కోరిన వెంటనే సామర్థ్యాన్ని పెంచుతూ ట్రాన్స్‌ఫార్మర్లను బిగిస్తున్నట్టు చెప్పారు. రైతులు స్టార్టర్ల వద్ద కెపాసిటర్లు అమర్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఏడీఈ రఘుపతి, ఏఈ దివాకర్‌రావు, సబ్ ఇంజినీర్ నవీన్, శ్రీనివాస్, అశోక్‌రెడ్డి ఉన్నారు.

వెటర్నరీ ఆసుపత్రి తనిఖీ

ధర్మపురి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని వెటర్నరీ ఆసుపత్రిని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి (డీవీఏహెచ్‌వో) డాక్టర్ వేణుగోపాల్‌రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో నిర్వహిస్తున్న అన్ని అధికారిక రికార్డులు, రిజిష్టరులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ దుంపల వేణుగోపాల్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

వరి సాగులో వెద జల్లుడు పద్ధతి అనుసరించాలి

వెల్గటూర్, జులై 18 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి సాగులో వెద జల్లుడు పద్ధతి అనుసరించాలని జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ సూచించారు. శుక్రవారం మండలం లోని కోటిలింగాల గ్రామంలో వెదజల్లె పద్దతిలో వరి సాగు చెసె రైతు దాసరి మల్లేష్ పొలంని పరిశీలించారు. తోటి రైతులని కూడ పాటించాలని వరిలో వేదజల్లుడు పద్దతి గురించి అవగాహన కల్పించారు. మండలంలో వెదజల్లె పద్దతి అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల సాయికిరణ్, రైతులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

కొడిమ్యాల, జూలై 18(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజలు కేసీఆర్ పాలలనను కోరుకుంటున్నారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో స్థానిక సంస్థల ఎన్నికల, బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పులి వెంకటేష్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కార్యకర్తలు సిద్దంగా ఉండాలన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ ప్రశాంతి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, తిర్మలాపూర్ సింగిల్ విండో చైర్మన్ రాజేందర్, మాజీ సర్పంచులు తిరుపతి, స్వామిరెడ్డి, మల్లేశం, హరెందర్, మహిపాల్, హైదర్, నాయకులు రాజేశం, ప్రవంతి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల పరిశీలన

ఎండపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారిపేట గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. అంతర పంటల సాగు గురించి, వరిలో వెదజల్లుడు పద్ధతి గురించి అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏవో కమల్ల మహేష్, ఏఈవో సందీప్, మౌనిక, లావణ్య రైతులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

రాయికల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో జరిగిన స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్ష ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన రాయికల్ పట్టణానికి చెందిన మూగల మారుతికి శుక్రవారం రాయికల్ పట్టణ, మండల బీజేపీ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ స్వర్ణకారులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కురుమ మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు ఆకుల మహేష్, ఉపాధ్యక్షులు వటిమల్ల శ్రీనివాస్, సంకోజి మహేష్, ఉడుత రవీందర్, మండల స్వర్ణకార సంఘం అధ్యక్షుడు మూగల సంజీవ్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ముత్యం రెడ్డి, తిప్పిరెడ్డి రాజశేఖర్, భూమేష్, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

ఇబ్రహీంపట్నం, జూలై18 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటలు యూరియా తగు మోతాదులో వాడాలని మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ సూచించారు. మండలంలోని మూల రాంపూర్ గ్రామంలో శుక్రవారం మొక్క జొన్నలో యూరియా వాడకంపై అవగాహన సదస్సును నిర్వహించారు.

క్రీడల్లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

మల్యాల, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ స్పోర్ట్స్ మీట్‌లో తాటిపల్లి బాలికల గురుకుల విద్యార్థినులు సత్తా చాటారు. అండర్-14 లాంగ్‌జంప్‌లో ఏ.హర్షిత(ప్రథమ), జి.మేధశ్రీ(ద్వితీయ), అండర్-18 లాంగ్‌జంప్‌లో జర ఫతీమా(తృతీయ), 1000మీటర్ల పోటీలో బి.హారిక(ప్రథమ), షాట్‌పుట్‌లో జర ఫతీమా(ప్రథమ), ఎస్.అక్షయ(ద్వితీయ) ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ మానస తెలిపారు.

పల్లె ప్రకృతి వనం పరిశీలన

కొడిమ్యాల, జూలై 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనాపూర్ గ్రామ శివారులో గురువారం గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో ధ్వంసమైన పల్లె ప్రకృతి వన్నాన్ని మండల ఏపీవో సతీష్ ఆద్వర్యంలో సంబందిత అధికారులు శుక్రవారం పరిశీలించారు. ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవటానికి ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామని ఏపీవో తెలిపారు.

వైభవంగా బోనాల వేడుకలు



కోరుట్లలో బోనాలతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



జగిత్యాలలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జగిత్యాల క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం వాణి నగర్, బీట్ బజార్, తులసీ నగర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి బోనాల పండుగను నిర్వహించారు. మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని డీజే, డప్పు చప్పుల్లు, కోలాటాలతో ఊరేగింపు నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణంతో పాటు కాంగ్రెస్ నాయకులు వేడుకల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అరుముల్ల నర్సమ్మ, నాయకులు పవన్, నవీన్, లక్ష్మణ్, అంజయ్య తదితరులు ఉన్నారు.

●**కోరుట్ల:** దుర్గమ్మ తల్లికి బోనాల సమర్పణ శుక్రవారం వైభవంగా సాగింది. పట్టణంలోని కాలేజీ గ్రౌండ్ సమీపంలోని దుర్గమ్మ తల్లికి బోనాలను మహిళలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజల ఆరోగ్యంగా ఉండాలని, వ్యాపారాలు బాగా సాగాలని దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయ సమీపంను నుండి మహిళలు బోనాల శోభయాతను నిర్వహించారు. శోభయాత్ర దుర్గాదేవి దేవాలయ వరకు కొనసాగింది. బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ పెండం గణేష్ పాల్గొన్నారు.

●**మెట్‌పల్లిటౌన్:** పట్టణంలోని మహాలక్ష్మీ ఆలయంలో శుక్రవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలు కుల సంఘల సభ్యులతో పాటు మహిళలు బోనాలు నెత్తిన ఎత్తుకోని డప్పు చప్పులతో ఊరేగింపుగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారికి నైవేద్యంతో కూడిన బోనం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు, నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బీజేపీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** పెగడపల్లి మండల కేంద్రంలో వైష్ణవి పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టి పడేలా విద్యార్థులు సాంప్రదాయ పద్ధతిలో పోతరాజుల విన్యాసాలు, పెద్దపులుల వేషధారణలు, డప్పు చప్పుళ్ల మధ్య నెత్తిన బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ అలయానికి తరలివెళ్లారు. పోచమ్మ తల్లికి బోనాల నైవేద్యం సమర్పించి బోనాల పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యాలు చేస్తున్న నవ్య కళాశాల విద్యార్థినులు

జగిత్యాల అగ్రికల్చర్. జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవ్య బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ వేడుకలకు పట్టణ ఎస్సై సుప్రియ హాజరై మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థినులు అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటర్ పరీక్షల్లో రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు ఇంజనీరింగ్, మెడిసిన్‌లో సీట్లు సాధించిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీపాద నరేష్, ప్రిన్సిపాల్ గాలిపెల్లి ఈశ్వర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

వెల్గటూర్, జులై 18 (ఆంధ్రజ్యోతి): మండలం లోని శాఖపూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చల్లూరి రామచందర్ గౌడ్ గారి అధ్యక్షతన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జూపాక కుమార్, పత్తిపాక వెంకటేష్, పెద్దూరి భరత్, మూగల సత్యం, కొప్పుల సురేష్, ముల్కల గంగారం, బాలసాని సత్యం, బిడారి తిరుపతి, పోడేటి రవి, అల్లం శంకరయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

మెట్‌పల్లి రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలను తమ తల్లి పేరు మీద నాటి సంరక్షించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ నాగ మణి అన్నారు. శుక్రవారం మండలంలోని మేడిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లి పేరు మీద ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటి నీరు పట్టారు.

పాఠశాలకు చేయూత

ఇబ్రహీంపట్నం, జూలై18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములకుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న ఎం.గంగామణి రూ.40వేల తన సొంత ఖర్చులతో పాఠశాలలో రంగులు వేయించి పిల్లలకు బొమ్మలు తదితర సామాగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా సెక్రటరీ పెంట లింబాద్రి శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం సారంగపాణి, ఎస్సీ కాలనీ స్కూల్ హెచ్ఎం శంకర్, ఎస్ఎంసి చైర్మన్ భవాని పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన విద్యార్థులు

భీమారం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భీమారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 7వ తరగతి విద్యార్థులు శుక్రవారం నాయనమ్మ పాఠ్యాంశ బోధనలో భాగంగా జగిత్యాల పట్టణం లోని టీఆర్‌నగర్ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జవ్వాజి అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.